# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అమరావతిలోని తుళ్లూరు సమీపంలో నిర్మిస్తున్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పాల్గొంటారు.**

2. **క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన కలయికే రంజాన్ మాసమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

3. **వైద్య వృత్తి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, మానవత్వంతో కూడిన పవిత్ర సేవని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.**

4. **ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు భద్రత కోసం హెల్మెట్ వినియోగించాలని డీసీపీ షరీన్ బేగం పేర్కొన్నారు.**

==========================

అమరావతిలోని తుళ్లూరు సమీపంలో నిర్మిస్తున్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహ ఆవిష్కరణ రేపు జరగనుంది. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల సందర్భంగా 6.8 ఎకరాల స్మృతివనంలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' పేరుతో శ్రీ పొట్టి శ్రీరాములు 58 రోజుల ఆమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.

---------------------------

ముస్లింల సంక్షేమానికి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 6 వేల 90 కోట్ల రూపాయలను మైనార్టీల సంక్షేమానికి కేటాయించిందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పెద్దమసీదులో రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందును మంత్రి నిన్న రాత్రి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన కలయికే రంజాన్ మాసమని పేర్కొన్నారు.

---------------------------

వైద్య వృత్తి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, మానవత్వంతో కూడిన పవిత్ర సేవని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సర్వసభ్య సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఆసుపత్రి వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి

ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో వైద్యుల పాత్ర కీలకమని చెప్పారు. పీహెచ్‌సీలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వ గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న నవరత్న ఎన్‌బీఎఫ్‌సీ -- ఐఎఫ్‌సీ సంస్థ, హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో Urban Invest Window (UiWIN) వర్క్ షాప్ ఈరోజు ప్రారంభమైంది. పట్టణ స్థానిక సంస్థలు, నగరాలు పెట్టుబడులకు అనుకూలమైన పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులను రూపొందించడమే ప్రధాన లక్ష్యంగా రెండు రోజులు పాటు UiWIN పై మొదటి ప్రాంతీయ వర్క్‌షాప్‌ను HUDCO నిర్వహిస్తోంది. మొదటి రోజు కార్యక్రమంలో పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ పాల్గొన్నారు.

---------------------------

గృహ వంట అవసరాలకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌లు సమయానికి అందడం పట్ల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. నమోదు చేసిన తర్వాత నిర్దిష్ట సమయంలోనే సిలిండర్ అందిందని తమకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని చెప్పారు. గ్యాస్ సరఫరా విషయంలో కొన్ని అపోహలు, వదంతులు వ్యాపిస్తున్న నేపథ్యంలో వాటిని వినియోగదారులు నమ్మవద్దని కడలి గ్రామానికి చెందిన వైష్ణవి తెలియజేస్తూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తిలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ – డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు “ఆపరేషన్ వజ్రప్రహార్”లో భాగంగా కార్డన్, సెర్చ్ ఈరోజు నిర్వహించారు. పుట్టపర్తిలోని చిత్రావతిగుట్ట, పెద్దబజారు, సాయి నగర్, కర్ణాటకనాగేపల్లి తదితర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల బారిన పడి యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ EAGLE టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం అందించాలని చెప్పారు.

---------------------------

ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు భద్రత కోసం హెల్మెట్ వినియోగించాలని విజయవాడ ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ – డీసీపీ షరీన్ బేగం అన్నారు. విజయవాడలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్వాలిటీ వాక్ ను ఆమె, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ డైరెక్టర్ ప్రేమ సజనితో కలిసి జెండా ఊపి ఈరోజు ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా హెల్మెట్ వినియోగం ఆవశ్యకతను తెలియజేస్తూ విస్తృతంగా అవగాహన

కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీసీపీ షరీన్ బేగం పేర్కొంటూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలకు చెందిన మొత్తం 6 లక్షల 40 వేల 9 వందల 16 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, వీరి కోసం 3 వేల 4 వందల 15 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. 38 వేల 9 వందల 58 మంది ఇన్విజిలేటర్లు, 156 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను పరీక్షల పరివేక్షణకు నియమించారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల 30 నిమిషాలకు పరీక్ష ప్రారంభమై 12 గంటల 45 నిమిషాలకు ముగుస్తుంది. విద్యార్థులను ఉదయం 8 గంటల 30 నిమిషాల నుంచే పరీక్షా కేంద్ర ప్రాంగణంలోకి అనుమతిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా 24 పేజీల ప్రధాన ఆన్సర్ బుక్‌లెట్‌ను అందిస్తున్నట్టు వెల్లడించారు.

---------------------------

అన్యాయమైన పద్ధతులు, వివక్ష, దోపిడీకి గురి కాకుండా వినియోగదారులను రక్షించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం మార్చి 15వ తేదీన 'ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు. 1962, మార్చి 15వ తేదీన నాటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీ యూఎస్ కాంగ్రెస్‌లో వినియోగదారుల హక్కుల సమస్యలపై కీలక ప్రసంగం చేశారు. ఈ స్ఫూర్తితో మొదటి ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని 1983లో నిర్వహించారు. అప్పటి నుంచి కన్స్యూమర్స్ ఇంటర్నేషనల్ అనే సంస్థ దీన్ని అధికారికంగా జరుపుతోంది. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు వారి రక్షణ, సాధికారత, హక్కులపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈ నెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

ఉత్తరప్రదేశ్‌లోని మధ్య ప్రాంతాల నుంచి అంతర్గత ఛత్తీస్‌గఢ్ మీదుగా దక్షిణ అంతర ఒడిశా వరకు ద్రోణి విస్తరించి కొనసాగుతుందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

వాయిస్...29 సెకన్లు

=====================